HICON SERIES

CLASS 3 TERM-1

# తెలుగు భారతి

## LESSON 4






CLICK HERE TO ACTIVATE

LESSON

# 4. సమయస్ఫూర్తి

అనగనగా ఒక చెరువులో ఒక తాబేలు ఉండేది. చెరువు చుట్టూ ఒక పెద్ద అడవి ఉండేది. ఆ అడవిలో రకరకాల జంతువులు ఉండేవి. ఆ అడవిలోనే ఒక నక్క ఉండేది. ప్రతిరోజూ నక్క చెరువుకు వెళ్ళి దప్పిక తీర్చుకునేది. ఈ విధంగా తాబేలుకు, నక్కకు మైత్రి కుదిరింది.



ఒక రోజు నక్క తాబేలుతో " నీవు ఎంతసేపు అలా నీటిలో ఉంటావు? నీవు బయటికి వస్తే, మనం కాసేపు ఎంచక్కా అడవంతా తిరిగి ఆడుకొని మళ్ళీ రావచ్చు ! " అంది. తాబేలుకు కూడా 'నిక్కమే' అనిపించింది. దానికి కూడా ఎప్పుడూ నీటిలో ఉండడం విసుగ్గానే ఉంది.

అందుకే నక్క మాటలకు తాబేలు బదులు చెప్పలేదు. వెంటనే ఒప్పుకుంది. ఇద్దరూ బయటకు వచ్చి అలా అడవిలో నడవడం మొదలుపెట్టారు. ఇంతలో ఎక్కడినుండో ఒక చిరుతపులి వచ్చింది. దాన్ని చూడగానే నక్క ప్రాణభయంతో ఒక గుహలోనికి పారిపోయింది.



కాని తాబేలు వేగంగా నడవలేదు కాబట్టి, నెమ్మదిగా నడుస్తుండగా ఆ చిరుతపులి వెంటనే తాబేలును ఒడిసి పట్టుకుంది. తినాలని దానిని కొరికి చూసింది. కానీ తాబేలు శరీరం గట్టిగా, రాయిలాగా ఉంది కాబట్టి, దానికి కొరుకుడు పడలేదు.

వెంటనే తాబేలుకు ఒక ఆలోచన వచ్చింది. చిరుతపులితో "నేను నీటిలో ఉంటేనే మెత్తగా ఉంటాను. కానీ నేను నేలమీద చాలాసేపటి నుండి తిరుగుతున్నాను. కాబట్టి ఇలా గట్టిగా అయ్యాను. నన్ను కాసేపు నీటిలో నానబెట్టి మెత్తగా అయ్యాక తిను" అంది. ఆ మాటలు చిరుతపులికి నచ్చాయి. కానీ, నీటిలో తాబేలు తప్పించుకుంటుందని అనుమానం వచ్చింది.

అయితే చిరుతపులి అనుమానాన్ని గ్రహించి తాబేలు "నన్ను నీ కాలితో గట్టిగా పట్టుకొని, నీటిలో నానబెట్టు" అని చెప్పింది. దాంతో చిరుతపులి సరేనన్నది. తాబేలును తన కాలితో పట్టుకొని నీటిలో కాసేపు ఉంచింది.

కొంతసేపటి తరువాత తాబేలుతో 'నానావా?' అని అడిగింది. "అంతా నానాను కానీ, నువ్వు కాలు పెట్టిన చోటున మాత్రం నానలేదు!" అని చెప్పింది. అంతే ముందూ వెనకా ఆలోచించకుండా చిరుతపులి వెంటనే తాబేలుపై నుండి కాలిని తీసింది.
ఇంకేముంది? తాబేలు హాయిగా నీటిలో మునిగి, చిరుతపులి బారినుండి తప్పించుకుంది.

నీతి :- సమయస్ఫూర్తితో ఎటువంటి ఆపదనుండి అయిననూ బయటపడవచ్చు.




I. అర్థాలు :

| | | |
|---|---|---|
| దప్పిక | = | దాహం |
| మైత్రి | = | స్నేహం |
| ఎంచక్కా | = | చక్కగా, హాయిగా |
| నిక్కము | = | నిజము |
| ప్రాణభయం | = | ప్రాణాలపై తీపి |
| ఒడిసిపట్టు | = | గట్టిగా పట్టుకొను |

## II. వ్యతిరేకపదాలు :

| | | |
|---|---|---|
| మైత్రి | × | విరోధం |
| బయట | × | లోపల |
| నిక్కము | × | కల్ల |
| విసుగు | × | ఉత్సాహం |
| వేగం | × | నెమ్మది |
| గట్టిగా | × | మెత్తగా |
| ముందు | × | వెనుక |
| మునుగు | × | తేలు |

## III. ఏకవచనం - బహువచనం

| | | |
|---|---|---|
| తాబేలు | - | తాబేళ్ళు |
| అడవి | - | అడవులు |
| అనుమానం | - | అనుమానాలు |
| కాలు | - | కాళ్ళు |

## IV. క్రింది వాక్యాలలో తప్పు ( × ) ఒప్పు ( ✓ ) లను బ్రాకెట్లలో గుర్తించండి.

1. నక్క, చిరుతపులి స్నేహంగా ఉండేవి. ( )
2. తాబేలు ప్రాణభయంతో పారిపోయింది ( )
3. చిరుతపులి తాబేలును ఒడిసి పట్టుకుంది ( )
4. తాబేలు హాయిగా నీటిలో మునిగి తప్పించుకుంది ( )

## V. ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి.

1. తాబేలు, నక్కకు మైత్రి ఎలా కుదిరింది ?
2. చిరుతను చూడగానే నక్క ఏమి చేసింది ?
3. చిరుతపులి తాబేలును ఎందుకు కొరకలేకపోయింది ?
4. తాబేలు ఎలా తప్పించుకుంది ?